క్లుప్తంగా

నేడు చండీహోమం



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: ఈ నెల 12వ తేదీ శనివారం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. చైత్రపౌర్ణమిని పురస్కరించుకుని 74వ చండీ హోమం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారికి సుమారు ఇరవై ఐదు కేజీల వెండితో వెండి చీర తయారు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా మారిశెట్టి చిన్న సూర్య ప్రకాష్, లక్ష్మి దంపతులు 10 తులాల వెండిని, కాటేపల్లి శ్రీనివాసరావు, పద్మజ దంపతులు 5 తులాల వెండిని, గౌతు నాగరాజు పార్వతి దంపతులు 5 తులాల వెండిని సమర్పించారని రాజాన సత్యనారాయణ తెలిపారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

కొయ్యలగూడెం: మంగపతీదేవిపాలెం గ్రామంలో శుక్రవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వాడపల్లి దామోదరరావు సౌజన్యంతో, మాజీ సర్పంచ్ వాడపల్లి రాధాకృష్ణ బ్రదర్స్ ఆధ్వర్యంలో ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం పరిసర గ్రామ ప్రాంతాలకు చెందిన ఐదువేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాజవరం పంచాయతీ పరిధిలోని శివారు గ్రామమైన మంగపతీదేవి పాలెంలో 1972లో రామాలయాన్ని నిర్మించగా ఇపుడు ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన చేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొయ్యలగూడెం: స్వామి అయ్యప్ప జన్మదినోత్సవం శుక్రవారం టెంపుల్స్ సెంటర్‌లో అయ్యప్ప స్వామి మందిరంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం వివరణ కార్యక్రమం చేశారు.

ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

బుట్టాయగూడెం: మండలంలోని కుమ్మరిగట్టు వద్ద నిర్మించనున్న శ్రీరమా సహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేశారు. ఈ నిర్మాణానికి సంబంధించి పోస్టర్లను శుక్రవారం సాయంత్రం విజయ గణపతి ఆలయం వద్ద స్థలదాత ఆలపాటి దుర్గారావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొండేపాటి రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో పురోహితులు అనిపెద్ది రామకృష్ణ శర్మ, గ్రామ పెద్దలు దొమ్మేటి లక్ష్మీజనార్ధన్, దొమ్మేటి సత్యనారాయణ, ప్రగడ సూరిబాబు, కమిటీ సభ్యులు పెనుగుర్తి సోంబాబు, కోసూరి నరేష్, దంగేటి కరుణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీవో

లింగపాలెం: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏపీవో వరలక్ష్మి సిబ్బందికి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఏపీవో సింగగుడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల మస్తర్లను తనిఖీ చేశారు. ఉపాధి సిబ్బంది, కూలీలకు పని కొలతలు చూపించి పనిని కేటాయించాలని ఆమె తెలిపారు.

అకాల వర్షం... అన్నదాతల కలవరం

రోజంతా ఎండ... రాత్రి భారీ వర్షం



గుండుగొలను హైవేపై తడిసిన ధాన్యం బస్తాలు



గుండుగొలను తడిసిన ధాన్యాన్ని వేరే సంచుల్లో పోస్తున్న కూలీలు



గుండుగొలను హైస్కూలు వద్ద ధాన్యం బస్తాలను లారీలోకి వేస్తున్న దృశ్యం

భీమడోలు: గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం రైతుల్లో గుబులు రేపింది. ఊహించని రీతిలో వరుణుడు తన ప్రతాపాన్ని చూపడంతో రైతులు ఆందోళన చెందారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం...రాత్రికి ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులకు వర్షం గట్టి దెబ్బే తగిలింది. భీమడోలు నుంచి గుండుగొలను వరకు గల జాతీయ రహదారిపై ఎక్కడ చూసిన ఆరబోసిన ధాన్యమే కనిపిస్తుంది. అకాల వర్షానికి పాక్షికంగా ధాన్యం బస్తాలు తడిసాయి. రైస్ మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసిపోగా, బస్తాల్లో ఉన్న ధాన్యం సైతం తడిసాయి. దీనితో శుక్రవారం రైతులు ఉరుకులు పరుగులు తీసారు. ఆ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసారు. బస్తాల్లో తడిసిన ధాన్యాన్ని వేరే గోనె సంచుల్లోకి ఎత్తారు. పొలాల్లోని ధాన్యం బస్తాలను ట్రాక్టర్లపై రహదారిపైకి తీసుకుని వచ్చి అక్కడ లారీల్లోకి కూలీలతో వేస్తున్నారు. సాంకేతిక కారణాల రీత్యా ఏ మిల్లుకు ధాన్యం తరలించాలో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ట్రక్ షీట్లు జారీ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు తమకు సమీపంలోని రైస్ మిల్లులు ధాన్యం తరలించుకోవచ్చునని చెబుతున్నా ట్రక్ షీట్లు ఉండాలని, అధికారులకు చెబుతున్నారని రైతులు అంటున్నారు. తేమశాతంలో వెసులుబాటు కల్పించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఎక్కడా ధాన్యం తరలింపులో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడలేదని సంబంధిత వ్యవసాయ సిబ్బంది అంటున్నారు.

గుర్రపు డెక్కను తొలగించరూ !



ఉంగుటూరు వంతెన వద్ద గుర్రపు డెక్క అడ్డు పడిన దృశ్యం

ఉంగుటూరు: ఏలూరు గోదవరి కాలువ లో గుర్రెపు డెక్క అలుముకు పోయింది. దాంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. శివారు భూముల పంటలకు నీరు అందక రైతులు రైతులు ఇబ్బందులు పడుతున్నాన్న నేపథ్యంలో గుర్రపు డెక్క మరింతగా ఇబ్బంది పెడుతోంది. దెందులూరు, భీమడోలు మండలాల శివారు భూములకు దాళ్వా కునీరందక ఇబ్బంది పడుతున్న విషయం తెల్సిందే. గుర్రుపు డెక్కను తొలగించాల్సిన ఇరిగేషన్ శాఖ అధికార్లు చోధ్యం చూస్తున్నారు. నీటి సంఘాల ప్రతినిధులు ఈవిషయంలో కల్పించుకున్న దాఖాలాలు లేవు. ఉంగుటూరు మండలంలో బాదంపూడి మెదలుకుని కైకరం శివారు వరకు ఈ గుర్రపు డెక్క ఎక్కువగా అలుముకపోయింది. అండర్ టన్నెల్సు వద్ద, బ్రిడ్జిలు వద్ద , గట్లు వెంబడి ఈగుర్రపు డెక్క ఎక్కువగా ఉంది. ఈగుర్రెపు డెక్కను తొలగించి నీటి ప్రవాహనికి ఆటం కం తొలగించమని రైతులు కోరుతున్నారు. ఈవిషయంపై ఎఇ సుధారాణిని అడగగా గుర్రుపు డెక్క గతంలో ఓసారి తీయించామని తెలిపారు. ఇపుడు మరళ కాంట్రాక్టు ఇచ్చి తీయించాల్సి ఉందని వివరించారు.

జాలిపూడి అమ్మవార్ల జాతరకు సర్వం సిద్ధం



దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గంగానమ్మ, పోతురాజు బాబు, ఆది మహాలక్ష్మి, వినుకొండ అంకమ్మవార్ల జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశామని జాలపూడి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ దాసరి నాగమల్లేశ్వరి తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద ఆమె మాట్లాడుతూ ఈనెల 16న ఉదయం 11.12 గంటలకు అమ్మవార్ల జాతరను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభిస్తారని తెలిపారు. అమ్మవారికి ముడుపు కట్టి రాత్రి 10.08 గంటలకు మేళతాళాలతో గ్రామ పొలిమేరలు ఆనకట్టుట ఉంటుందన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త దీపక్ నెక్స్‌జెన్ కంపెనీ అధినేత అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతరలో భక్తులందరూ పాల్గొని అమ్మవారి దీవెనలు పొందాలని కోరారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



గుండుగొలనులో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తున్న పెద్దలు

భీమడోలు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గుండుగొలనులో విగ్రహ దాత వగ్వాల అచ్యుతరామారావు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్య ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమని నమ్మి అణగారిన వర్గాలకు విద్యను నేర్పించేందుకు ముందుకొచ్చిన మహనీయుడన్నారు. బాల్య వివాహాలు, వితంతులకు శిరోముండనం చేయడాన్ని వ్యతిరేకించారన్నారు. వితంతు మహిళలకు వివాహాలకు ప్రోత్సహించారన్నారు. నేటి సమాజంలో ఉన్నతమైన మార్పుకు ఆయన ఆద్యుడన్నారు. నేటి పాలకులు ఆయనను ఆదర్శంగా తీసుకుని సుపరిపాలనను అందజేయాలన్నారు. అనంతరం వగ్వాల అచ్యుతరామారావును పెద్దలు దుశ్శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మూర్తి, ప్రవీణకుమార్, పాకిన సత్యనారాయణ, కాకోతుల సోమేశ్వర రావు, అరసంకల సోములు, వగ్వాల కిషోర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాదీపం జ్యోతిరావు పూలే

గణపవరం: సమాజానికి పునాదిరాళ్లుగా నిలిచిన జోతిరావుపూలే అని ఆయన ఆశయసాధనకు యువత కృషి చేయాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావుపూలే 111వ జయంతి సందర్భంగా వాసుబాబు క్యాంపుకార్యాలయంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి వాసుబాబు, పార్టీ నాయకులు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ అణగారిన వర్గాలను సామాజికంగా అణచివేతకు గురై, దుర్భర జీవితాలు గడుపుతున్న ఆరోజులలో జ్యోతిరావు పూలే వారి అభ్యున్నతికి ప్రాణాలకు తెగించి పోరాటాలు చేసి అణగారిన వర్గాల గుండెల్లో కొలువయ్యారని అన్నారు. బడుగువర్గాల అభ్యున్నతి విద్యతోనే సాధ్యమని ఆరోజులలోనే మహిళలకు, అణగారిన వర్గాలకు విద్యావకాశాలను కల్పించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే అని నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్య కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పొత్తూరి శ్రీనివాస రాజు, జిల్లా కార్యదర్శి కందులపాటి శ్రీను, పార్టీ నాయకులు జి.విశ్వనాధ రాజు, నడింపల్లి రాము, బేతు సుబ్బారాయుడు, నిమ్మలరమేష్, అడపా శ్రీను స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే గణపవరం మండలం పిప్పరలో పూలే జయంతి వేడుకలు బీసీ నాయకులు కొప్పిశెట్టి ఏసుబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు మాట్లాడుతూ జ్యోతిరావుపూలే ఆలోచనలు అణగారిన వర్గాలలో స్ఫూర్తిని కలిగించాయన్నారు. ఈకార్యక్రమంలో బీసీ నాయకులు గాలి ఏసుబాబు, డి.బాలాజీ, అన్నవరం, నాగయ్య, సుబ్బరాజు, సుబ్బారావు, సూరిబాబు, ఫణి, మురళి తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసుబాబు, పార్టీ నేతలు



పిప్పరలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



వేగివాడలో పౌష్టికాహార పక్షోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



గర్భిణులకు సూచనలిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

పెదవేగి : పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం సాధ్యమని విజయరాయి, పెదవేగి సెక్టార్ సూపర్‌వైజర్‌లు కె మేరీబాయమ్మ, సీహెచ్ పార్వతిలు అన్నారు. పెదవేగి మండలం వేగివాడలో స్థానిక సర్పంచ్ పంది ప్రభావతి అధ్యక్షతన పౌష్టికాహార పక్షోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, కిషోర బాలికలకు పౌష్టికాహార పక్షోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెదవేగి సెక్టార్ పరిధిలోని పెదవేగి గ్రామంలో స్థానిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి మాధవి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈనెల 8 నుంచి 22 వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గణపవరం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రభుత్వం ఐసిడిఎస్ ద్వారా అందజేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని పిప్పర సెక్టార్ ఐసిడిఎస్ సూపర్ వైజర్ దుర్గాభవాని అన్నారు. శుక్రవారం గణపవరం మండలం మొయ్యేరు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈఉత్సవాలు ఈనెల 22వ తేదీ వరకూ జరుగుతాయని, అన్ని అంగన్‌వాడి కేంద్రాలలో ఈకార్యక్రమం జరుగుతుందన్నారు. గర్భిణులకు రూ.1000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి

దెందులూరు: గర్భిణులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చిట్టిమ్మ, పద్మభూషణం, కె.శ్రీదేవిలు తెలిపారు. పెదపాడు సెక్టర్ పరిధిలో మూడు గ్రామాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడ్ పై అవగాహన సమావేశాలు జరిగాయి. దెందులూరులో సెక్టార్ సూపర్‌వైజర్ ఏ చిట్టిమ్మ ఆధ్వర్యంలో గాలాయిగూడెంలో సెక్టార్ సూపర్‌వైజర్ డి పద్మభూషణం, సింగవరం గ్రామంలో సెక్టార్ సూపర్‌వైజర్ కే శ్రీదేవి ఆధ్వర్యంలో గర్భిణీలు బాలింతలు చిన్నారులకు సమావేశాలు నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, ఐదేళ్ల లోపు పిల్లల తల్లులకు ఇన్‌ఫెక్షన్‌లు సోకకుండా చేతులను కడుక్కోవడం, పరిశుభ్రత, తల్లిపాలు, అనుబంధ పోషకాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు మనుగడ కోసం పోరాటం



ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

దెందులూరు: రైతుల హక్కులను హరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవసాయ విధానాలు అవలంభించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దెందులూరు మండలం పోతునూరులో అఖిల భారత కిసాన్ సభ (ఎ.ఐ.కె.ఎస్) 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. రైతు ఉద్యమ అమరవీరుడు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తికి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11న ఏర్పడిన అఖిలభారత కిసాన్ సభ దేశ స్వాతంత్ర్యం కోసం, జమీందారీ విధానం రద్దు కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. అనేకమంది చేసిన త్యాగాలు ఫలితంగా రైతులు హక్కులు సాధించుకున్నారని చెప్పారు. రైతు వ్యతిరేక చట్టాలపై రైతాంగం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మద్దతు ధరలు గ్యారంటీ చట్టం తీసుకురావాలని, రైతు రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షుడు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, చల్లా బాలస్వామి పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద కనీస వసతులు కరువు



కలకుర్రు ఫారెస్ట్ చెక్‌పోస్టు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం కలకుర్రు ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద కనీస వసతులు కరువయ్యాయి. ఇక్కడ తాగునీరు, పోస్ట్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ చెక్ పోస్ట్ మీదుగా వెళ్లే వాహనాల నెంబర్ల నమోదుకు ఇబ్బంది పడుతున్నారు. దాహర్తితో అజిల్లా ఉన్నతాధికారులు చెక్ పోస్టును పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బంది, గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరగా స్పందించేందుకు డీఎఫ్ఓ నిరాకరించారు.

దంత కళాశాలలో అంతర్గత ఆటల పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగించిన దంత కళాశాల చైర్మన్ మోస్ట్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు

పెదవేగి : ప్రతీ సంవత్సరం నిర్వహించే సెయింట్ జోసెఫ్ దంత కళాశాల అంతర్గత ఆటల పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయని సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాల్లో 2024– 25 సంవత్సరానికి అంతర్గత క్రీడా పోటీల భాగంగా క్రీడల దినోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ ఏలూరు పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర అధ్యక్షతన వహించారు. క్రీడల దినోత్సవం సందర్భంగా కళాశాల్లో విద్యార్థులందరూ క్రీడా మైదానంలో మార్చ్ ఫాస్ట్ చేస్తూ అతిధులకు క్రీడ అభిమానాన్ని చాటారు. ప్రతీ బ్యాచ్ వారికి కేటాయించిన జెండాని గౌరవాన్ని ప్రదర్శించిన క్రీడా ప్రతిజ్ఞ పలువురిని ఆకట్టుకుంది. జాతీయ జెండా ఆవిష్కరణ కళాశాల జెండా ఆవిష్కరణను గౌరవ అతిధి, కళాశాల యాజమాన్యం నిర్వహించారు. అనంతరం ప్రతి ఒక్క బ్యాచ్ నుంచి ఇద్దరు మహిళా, పురుషులు క్రీడాజ్యోతిని కళాశాల ప్రాంగణంలో ప్రదర్శించి, క్రీడల ప్రతిజ్ఞను చే శారు. కళాశాల్లోని విద్యార్థులందరికి క్రీడలు జరుగుతాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్ నల్లయ తెలిపారు. ఈ స్పోర్ట్స్ డే కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి మోజెస్ సహకారంతో, ప్రిన్సిపాల్ యస్. స్లీవరాజు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ విజ్ఞాన నిలయం జానంపేట ఫాదర్ చిన్ను, కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పీ జాకబ్, జాలిపూడి విచారణ కర్త ఫాదర్ తోట అంతోని, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు కె అశోక్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



పోతునూరులో ధర్నా చేస్తున్న రైతులు, కౌలు రైతులు

దెందులూరు: సాంకేతిక సమస్య వల్ల మిల్లులు వద్దకు తీసుకువచ్చిన ధాన్యం అన్‌లోడ్ చేయక పోవడం వల్ల అకాల వర్షాలు కురవడంతో రైతులు, కౌలు రైతులు ఇబ్బందులుపడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ అన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో దెందులూరు మండలం పోతునూరులో శుక్రవారం రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కే.శ్రీనివాస్ మాట్లాడుతూ జీపీఎస్ ఆన్‌లైన్ సమస్యలు వెంటనే పరిష్కరించి మిల్లుల వద్దకు ట్రాక్టర్ల మీద రైతులు,కౌలు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని, ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. ఆన్‌లైన్ సమస్యతో అన్ని మిల్లులు వద్ద ధాన్యం ట్రాక్టర్లు అన్‌లోడ్ కాకుండా నిలిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 1 నుండి కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నామని అధికారులు ప్రకటించినా 10 రోజులు కావస్తున్న ఇంతవరకు పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు పనిచేయకపోవడంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. మరోవైపు అకాల వర్షాల వలన కల్లాల్లో ఉన్న ధాన్యం తడిచిపోయి రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. తేమ శాతం నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు పాల్గొన్నారు.